

జిల్లాకు ఏడు కొత్త సర్వీసులు

తిరుపతి జిల్లాకు ఏడు కొత్త లగ్జరీ సర్వీసులు వచ్చాయి. ఆ వాహనాలను రిజిస్ట్రేషన్ కోసం మంగళం డిపోలో ఉంచారు. - 8లో



కక్ష సాధింపు చర్యలు

వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు నెల్లిపూడి అన్వేష్‌పై పోలీసులు, రెవెన్యూ అధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
తిరుపతి	6-27	4-57
గూడూరు	6-21	4-53

న్యూస్‌రీల్

పీఎంఎఫ్ఎంఈ అభివృద్ధికి చర్యలేంటి?



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల పథకం (పీఎంఎఫ్ఎంఈ) అమలుపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని గురువారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పార్లమెంటులో ప్రశ్నించారు. ఈ పథకం అమలు స్థితి, లబ్ధిదారుల వివరాలు, మహిళలు, అణగారిన వర్గాలకు చెందిన సూక్ష్మ ఆహార పరిశ్రమలకు తీసుకున్న చర్యలు ఏమిటి, అమలులో ఎదురైన సవాళ్లు, పరిష్కార చర్యలు, లబ్ధిదారులకు ఆర్థిక సహాయం, శిక్షణ, మౌలిక సదుపాయాల వివరాలు, ఆహార ప్రాసెసింగ్ రంగవృద్ధికి రూపొందించిన భవిష్యత్ ప్రణాళికలు వివరాలు తెలపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల పోటీ శక్తిని పెంచడం, అసంఘటిత రంగాన్ని పటిష్టంగా మార్చి సంస్థీకృత రంగంగా అభివృద్ధి చేయడం, మహిళలు, ప్రాంతీయ వర్గాలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యమని కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ తెలిపారు. ఈ పథకం తిరుపతి నియోజకవర్గంలో అమలును వివరిస్తూ మొత్తం 248 మంది లబ్ధిదారులున్నారని, అందుకుగాను రూ.8.09 కోట్లు సబ్సిడీ రుణాలు మంజూరు చేశారని తెలిపారు. అలాగే 1,959 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 7.53 కోట్లు మూలధన సహాయం, ఐఐటీ తిరుపతిలో ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌కు రూ.2.60 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణలో భాగంగా 190 మంది లబ్ధిదారులకు ప్రత్యేకశిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,388 మంది స్వామివారిని దర్శించుకోగా 26,145 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

సమారోహం.. సంస్కృతికి ఛత్రం

సంస్కృత భాష పరిరక్షణ.. సంస్కృతి మనుగడే లక్ష్యంగా బోధన చేస్తున్న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన నాలుగో దీక్షాంత సమారోహం సంస్కృతికి ఛత్రం పట్టింది. పతకాలు.. పట్టాలు.. పీహెచ్‌డీలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందం అవధులు దాటి, ఉప్పొంగింది.

ఘనంగా జాతీయ సంస్కృత వర్సిటీ నాలుగో స్నాతకోత్సవం

- 22 మందికి బంగారు పతకాలు ప్రదానం
- 564 మందికి డిగ్రీ, పీజీ..75 మందికి పీహెచ్‌డీ పట్టాల అందజేత
- సంస్కృత భాషాభివృద్ధే లక్ష్యంగా వర్సిటీ అడుగులు



స్నాతకోత్సవంలో గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, వర్సిటీ అధికారులు



ఓవరాల్ టాపర్‌గా ఐదు పతకాలు సాధించిన తండ్రి అమిత్ విక్రమ్‌ను ముద్దాడుతున్న కుమార్తె, కుమారుడు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నాలుగో దీక్షాంత సమారోహం అట్టహాసంగా జరిగింది. తిరుపతి మహతి ఆడిటోరియం వేదికగా గురువారం జరిగిన వర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి అధ్యక్ష హోదాలో హాజరైన వర్సిటీ చాన్సలర్ పద్మభూషణ్ ఎన్ గోపాలస్వామికి వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్రీ సంస్కృత విద్యాపీఠం మాజీ వీసీ పద్మశ్రీ డాక్టర్ వీఆర్ పంచముఖి ఆన్‌లైన్ విధానంలో హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృతభాష పరిరక్షణకు మూలకేంద్రమని కొనియాడారు. ప్రాచీన సంస్కృత భాషను సంరక్షిస్తూ, ఆధునిక వైజ్ఞానిక తత్త్వాలను అనుసంధానిస్తూ, భారతీయ జ్ఞాన పరంపరను భావిభారతావనికి అందిస్తున్న ఉత్తమ క్షేత్రంగా వర్సిటీ విరాజిల్లుతుందన్నారు. త్వరలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను సంస్కృత భాషతో అనుసంధానం చేసేందుకు విశేష పరిశోధనలు చేస్తామని తెలిపారు.

నూతన పరిశోధనల వేదిక ఎన్ఎస్‌యూ

వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వర్సిటీ ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పరిశోధనలకు వర్సిటీ వేదికవుతోందన్నారు. సంస్కృత భాషాభివృద్ధే వర్సిటీ లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. దేశంలో పూర్తి స్థాయిలో అన్ని విభాగాల్లో సంస్కృత భాష బోధిస్తున్న ఏకైక వర్సిటీ జాతీయ సంస్కృత వర్సిటీ అని కొనియాడారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి వర్సిటీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాకోర్సులను సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

హృదయాన్ని స్పృశించిన సన్నివేశాలు

ఎన్ఎస్‌యూ నాలుగో స్నాతకోత్సవంలో పట్టాలు, బంగారు పతకాలు పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు కలిసిన సన్నివేశాలు వీక్షకులు హృదయాన్ని కట్టిపడేశాయి. పీజీ ఓవరాల్ టాపర్‌గా నిలిచి 4 పతకాలతో పాటు, ఒక బంగారు పతకం సాధించిన అమిత్ విక్రమ్ కుమారుడు, కుమార్తె తండ్రి సాధించిన పతకాలను పట్టుకుని ముద్దాడిన సంఘటన పలువురిని కలచి వేసింది. అలాగే పీజీ జ్యోతిష్యశాస్త్రంలో టాపర్‌గా నిలిచిన కేరళకు చెందిన ఎంపీ అన్గ్లే విద్యార్థి తల్లి షీజా కేరళ నుంచి వచ్చి, కుమార్తెను ముద్దాడి అక్కున చేర్చుకుని ఆనందబాష్పాలు రాల్చింది. అలాగే పీహెచ్‌డీ పట్టా అందుకున్న దివ్యాంగుడు కే హరిబాబుకు అధికారులు మోకాళ్లపై నిలుచుని పట్టా అందజేశారు. అనంతరం భార్య, ఆయన కుమారుడు డాక్టరేట్ పట్టాను చూస్తూ ఆనందోత్సాహంలో మునిగితేలారు.



బంగారు పతకాలను సాధించిన విద్యార్థుల గ్రూప్ ఫొటో

మెరిసిన 22 మంది బంగారు కొండలు

విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రతిభ చూపి ప్రథమస్థానం సాధించిన 22 మంది విద్యార్థులు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. గోల్డ్ మెడల్స్ సాధించిన వారిలో శాస్త్రీ విభాగంలో వై జానకి, బీఏలో జి సంధ్య, బీఎస్సీలో వి త్రిపురసుందరి, బీఎస్సీ యోగాలో టి అభినయ పసిడి పతకాలు అందుకున్నారు. ఆచార్య విభాగంలో సునీతాప్రష్టి, వైష్ణవి, అన్గా, అనురిధ్ భరద్వాజ్, మహదేవన్, దేవప్రసాద్ భట్, అజిత్ సింగ్, విక్రమ్, తునుశ్రీ, హేమసుందర్‌రావు, శుభశ్రీ, అష్రఫ్ అలమ్‌ఖాన్, కిషోర్ పాండే, సాగరిక సర్కార్, ఎంఎలో సంధ్యబాయ్, ఎమ్మెస్సీలో అభినయశ్రీ, ఎమ్మెస్సీ యోగాలో ఎం దేవీప్రసన్న బంగారు పతకాలు సాధించారు. వీరితో పాటు బీఈడీలో మోనికా బొహిదర్, ఎంఈడీలో జయక్రిష్ణరాయ్ ఉన్నారు.

ఐదు మహాగ్రంథాల ఆవిష్కరణ

రామానుజ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సురపురం శ్రీనివాసాచార్య రచించిన సిద్ధాంత చింతామణి, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ విభాగం ద్వారా శివరామభట్ సంపాదకీయంలోని మహస్వినీ పత్రికను, అనంతరం జ్యోతిష్య విభాగం డీన్ కృష్ణేశ్వర్ ఝా ఆధ్వర్యంలో వేదవేదాంగం, డాక్టర్ సోమనాథ దాస్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో వర్సిటీ న్యూస్ లెటర్ శేముషీ గ్రంథాలను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, డీన్లు దక్షిణమూర్తి శర్మ, రజనీకాంత శుక్లా, పరీక్షల నియంత్రణాధికారి కే సాంబశివమూర్తి పాల్గొన్నారు.

564 మందికి డిగ్రీ, పీజీ పట్టాలు.. 75 మందికి పీహెచ్‌డీలు

వర్సిటీ నాలుగో స్నాతకోత్సవంలో భాగంగా 2023–24 అకడమిక్ విద్యాసంవత్సరానికి సంబంధించి 75 మంది విద్యార్థులకు విద్యావారిధి(పీహెచ్‌డీ) పట్టాలను అందజేశారు. అలాగే 564 మంది విద్యార్థులకు ఆచార్య, ఎంఏ, ఎమ్మెస్సీ, బీఏ, బీఎస్సీ, ఎమ్మెస్సీ యోగాథెరఫీ, సర్టిఫికెట్, డిప్లొమో పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.



బంగారు పతకాలను సాధించిన ఆనందంలో తలపాగాలను గాలిలోకి విసిరేస్తున్న విద్యార్థులు



పీహెచ్‌డీ అందుకున్న వికలాంగుడు హరిబాబుతో కుమారుడు, భార్య



పసిడి పతకం పొందిన కుమార్తె పీఎం అన్గ్లేను ముద్దాడుతున్న తల్లి షీజా

ఓవరాల్ టాపర్‌గా అమిత్ విక్రమ్, జానకి

వర్సిటీలో ఆచార్య (పీజీ) స్థాయిలో విద్యార్థి కేఎస్ అమిత్ విక్రమ్ ఓవరాల్ టాపర్‌గా నిలిచి సుమారు ఐదు పతకాలను సాధించారు. అలాగే శాస్త్రి (డిగ్రీ) కోర్సులో ఓవరాల్ టాపర్‌గా నిలిచిన వై జానకి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ప్రాక్-శాస్త్రిలో (ఇంటర్) ప్రథమస్థానంలో నిలిచిన లక్ష్మీ ప్రసన్న బంగారు పతకం అందుకున్నారు.



ఓవరాల్ టాపర్స్‌గా నిలిచి పత్రాలు అందుకుంటున్న జానకి, అమిత్ విక్రమ్

ప్రశ్నించే గొంతును నొక్కేస్తారా?



పద్మావతీపురంలోని వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపు

తిరుపతి మంగళం : 'చంద్రబాబు అబద్ధపు హామీలపై ప్రజాగొంతుకై ప్రశ్నించే హక్కు వైఎస్సార్ సీపీ నేతలకు లేదా..?' అంటూ ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల అమలుపైన గురువారం తిరుపతికి విచ్చేస్తున్న సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించేందుకు బయలుదేరిన భూమన అభినయ్‌రెడ్డితోపాటు ఆ పార్టీ శ్రేణులను పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద పోలీసులు నిర్బంధించారు.

నాయకులను అడ్డుకున్న పోలీసులు

సీఎంను కలవడానికి వీల్లేదంటూ గేట్లు మూసేశారు. పార్టీ కార్యాలయం నుంచి బయటకు రాకుండా రోప్‌లతో అడ్డుకున్నారు. దాంతో పార్టీ కార్యాలయం వద్దే బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాటలు తప్ప చేతల్లో ఏదీ చేయడం లేదన్నారు. నిర్బంధించిన వారిలో పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, టౌన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు నల్లాని బాబు, కడపగుంట అమరనాథ్, దినేష్‌రాయల్, అనీల్‌రెడ్డి, పసుపులేటి సురేష్, మద్దాలి శేఖర్, మల్లం రవి, సుధాకర్, కోటి, రమణమ్మ, సాయికుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అభినయ్‌ని అడ్డుకుంటున్న పోలీసులు

పీఎం యోగా అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ప్రధాన మంత్రి యోగా అవార్డు–2025 ప్రదానానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తులు, సంస్థల నుంచి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు, ప్రతిపాదనలు జిల్లా నుంచి ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరచడం, ప్రోత్సహించడం, అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న వ్యక్తులు, సంస్థలు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తులను నిర్ణీత ప్రొఫార్మాలో ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 31వ తేదీలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం, సందేహాల నివృత్తి కోసం సెట్విన్ కార్యాలయం పనివేళల్లో, 0877–2286921, 9440573637 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇలవైకుంఠం.. ఇదేం అపచారం

వేంకటాద్రి నిలయం.. పరమ పవిత్రం..భక్తికి.. ముక్తికి..ఆధ్యాత్మికత క్షేత్రం..కలియుగ వైకుంఠవాసుడు కొలువైన ఇలవైకుంఠంగా పేరుగాంచిన పుణ్యస్థలం..ఇంతటి ప్రాధాన్యం శేషాచలంపై భక్తులు ఎంతో భక్తిభావంతో ప్రవర్తిస్తారు. అందుకే ఇక్కడ మద్యం, మాంసం, మత్తు పదార్థాలు, పానీయాలకు చోటు లేదు. ఇక్కడంతా ఆధ్యాత్మిక చింతనే కనిపిస్తుంది. అయితే కాల'కూటమి' అధికారంలోకి వచ్చింది. తిరుమలలో అపవిత్రత రాజ్యమేలుతోంది. నిత్యం మందుబాబులు చిందులేస్తుండడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇలవైకుంఠంలో ఇదేం అపచారమని ఆవేదన చెందుతున్నారు.

- తిరుమలలో మందుబాబులు హల్‌చల్
- నియంత్రించలేకపోతున్న విజిలెన్స్, పోలీస్
- తిరుమలకు అడ్డదారిలో మద్యం

తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారు వెలసిన దివ్య క్షేత్రం తిరుమల. స్వామివారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. పవిత్ర పుణ్యక్షేత్రం కావడంతో తిరుమలలో మాంసం, మత్తు పదార్థాలు, పానీయాలపై టీటీడీ నిషేధం విధించింది. తిరుమల పవిత్రతను, భక్తులకు భక్తి భావాన్ని పెంపొందించేలా అనేక చర్యలు అమలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమలలో మందుబాబులకు అడ్డాగా మారింది. రోజుకో ప్రాంతంలో రెచ్చిపోతున్నారు. తిరుమలలో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పీకలదాక





తిరుమలలో మందుబాబును ప్రశ్నిస్తున్న పోలీసులు, ఖాళీ మద్యం సీసాలు

మద్యాన్ని సేవించి తిరుమలలో హల్‌చల్ చేస్తున్న ఘటనలు అనేకం. శ్రీవారి ఆలయానికి సమీపంలోని శ్రీ భూవరాహస్వామి ఆలయం వద్ద ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో ఓ మహిళా భక్తురాలిపై దుసురుగా, అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా తిరుమలలో మద్యం ఎంత కావాలన్నా సేవిస్తానని, ఎంత మద్యం కావాలో చెప్పు.. నీకు తెచ్చిస్తాం అంటూ ఊగిపోయాడు. పోలీసులకు కావాలంటే కూడా అమ్ముతా అంటు రెచ్చిపోయాడు. ఆ విషయం విజిలెన్స్ కానిస్టేబుల్‌కి సైతం తెలుసు అంటూ విర్రవీగాడు. వెంటనే అక్కడికి చేరుకున్న విజిలెన్స్ సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

తిరుమలలో యథేచ్ఛగా అక్రమ మద్యం, గంజాయి

తిరుమలలో చిన్న గంజాయి ప్యాకెట్లు, మద్యం బాటిళ్లు యథేచ్ఛగా దొరుకుతున్నాయి. భారీ స్థాయిలో మత్తు పదార్థాలను నిఘా కళ్లు గప్పి తిరుమలకు తరలిస్తున్నారు. రోడ్డు మార్గం మీదుగా కొంతమేర అక్రమార్కులు తనిఖీ సిబ్బంది కళ్లు గప్పి తరలిస్తుంటే.. మరి కొంతమంది మామండూరు, అన్నమయ్య నడక మార్గాల మీదుగా తిరుమలకు అక్రమ మద్యం తరలిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో సరైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయక పోవడంతోనే మద్యం సరఫరా అవుతున్నట్లు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

నిద్దరోతున్న నిఘా

టీటీడీ నిత్యం మూడంచెల భద్రత నడుమ నిఘా వ్యవస్థ పనిచేస్తూ ఉంటుంది. భక్తుల రక్షణ, శ్రీవారి ఆలయ భద్రత నిర్వహణను టీటీడీ విజిలెన్స్, స్టేట్ పోలీస్, ఎస్పీఎఫ్, విజిలెన్స్ వింగ్, ఇలా అనేక విభాగాలు తిరుమలలో పహారా కాస్తుంటాయి. తిరుపతి నుంచి మద్యం తిరుమలకు రాకుండా అలిపిరిలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయినా వారి కళ్లుగప్పి తిరుమలకు చేరుకుంటున్నారు. పోలీస్ శాఖ నుంచి అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు భద్రత ప్రమాణాలు చేపడుతుంటే.. సీవీఎస్వో, వీజీఓ, ఏవీ ఎస్వో, వీఐ, అదనపు సిబ్బంది ఆలయభద్రతతో పాటు భక్తులకు రక్షణ కల్పిస్తూ ఉంటారు.

గంజాయి మత్తులో భక్తులపై దాడి

ఈ ఘటన జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే కొందరు యువకులు మద్యం, గంజాయి మత్తులో డీ టైప్ క్వార్టర్స్ వద్ద హల్‌చల్ చేశారు. మేము లోకల్.. మమల్ని ఏమీ చేయరంటూ అనధికార వ్యక్తులు జనాల్ని భయభ్రాంతులకు గురిచేశారు. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరంటూ భక్తులపై దాడికి దిగారు. ఓ భక్తుని తలపై బలమైన ఆయుధంతో మోది గాయాలపాలు చేశారు.

తిరుమలలో ఎక్సైజ్ శాఖ ఏమి చేస్తుంది?

తిరుమలలో ఎక్సైజ్ శాఖ సీఐ స్థాయి అధికారితో పాటు సిబ్బంది కూడా ఉన్నారు. అయితే ఈ శాఖ పనితీరు రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. తిరుమలలో ఎక్సైజ్ పోలీసులు ఉన్నారా? లేదా అన్న అనుమానం సైతం భక్తులు వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనం ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలే కారణం. తిరుమలలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ విభాగం అధికారులు తిరుమలలో అక్రమ మద్యం, ఇతర మత్తుపదార్థాలను గుర్తించి సీజ్ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కానీ ఏ విభాగం అధికారులు తిరుమలలో అక్రమ మద్యం, గంజాయి విక్రయాలపై దృష్టి సారించకపోవడం గమనార్హం. అలాగే ఎక్సైజ్ శాఖకు సంబంధించిన స్పెషల్ టాస్క్ ఫోర్స్, టాస్క్ ఫోర్స్ టీమ్‌లు సైతం నిర్వీర్యంగానే కనిపిస్తున్నాయి. తిరుమలలో ఎక్సైజ్ పోలీసులు ఉన్నా కూడా లేనట్లే అని భక్తులు వాపోతున్నారు.

క్లుప్తంగా

తిరుమలకు చేరుకున్న సీఎం చంద్రబాబు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీటీడీ చైర్మన్

తిరుమల: సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథిగృహం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, ఈఓ శ్యామలరావ్, అదనపు వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం శుక్రవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామివారిని దర్శించుకోనున్నారు. తర్వాత మనవుడు దేవాన్ష్ జన్మదినం సందర్భంగా తరిగొండ వెంగమాంబ అన్న సత్రంలో ఒక్కరోజు అన్నదానంలో పాల్గొననున్నారు.

జిల్లాకు ఏడు కొత్త సర్వీసులు

తిరుపతి అర్బన్: జిల్లాకు ఏడు కొత్త సూపర్ ల గ్జరీ సర్వీసులు వచ్చాయి. గురువారం ఆ వాహనాలను రిజిస్ట్రేషన్ కోసం మంగళం డిపోలో ఉంచారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

తిరుపతి క్రైమ్: పాత కక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేశారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం.. తిరుపతి 16వ వార్డులో కల్లూరు తులసీరామ్ శానిటరీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతడిపై డీఆర్ మహల్‌కి చెందిన గౌరీశంకర్ మరో ఇద్దరితో వచ్చి గురువారం కత్తులతో దాడి చేసి, పారిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. గౌరీశంకర్ తండ్రి నాగరాజు ఆరేళ్ల క్రితం చోరీ కేసులో స్టేషన్‌కు పిలవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో తులసీరామ్ తన కోడిని చోరీ చేశాడంటూ నాగరాజుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోనే తన తండ్రి మరణించాడని పగబట్టి దాడికి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. గౌరీశంకర్ ఇప్పటికే దొంగతనంతోపాటు హత్యాయత్నం కేసుల్లో మైనర్‌గా ఉన్నప్పుడే జైలు కెళ్లాడని ఎస్ఐ తెలిపారు.



శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్య కాలనీలో తాళాలు వేసి ఉన్న ఇల్లు



ఒడిశాలో తలదాచుకుని తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడుతున్న బాధితులు(ఫైల్)

ఊరికి దూరంగా..
బిక్కు బిక్కుమంటూ..

- తొమ్మిది నెలలుగా 25 షికారీ కుటుంబాలు గ్రామ బహిష్కరణ
- వైఎస్సార్ సీపీకి ఓటేశారన్న అక్కసుతో దౌర్జన్యం
- శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్య కాలనీలో ప్రజాస్వామ్యం ఖూనీ
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి గోడు వెళ్లబోసుకున్న బాధితులు

రేణిగుంట: వైఎస్సార్ సీపీకి ఓట్లేశారన్న అక్కసుతో ఆ గ్రామానికి చెందిన పచ్చనేతలు 25 గిరిజన కుటుంబాలను గ్రామం నుంచి వెళ్లగొట్టారు. ఇక్కడే ఉంటే చంపేస్తామని బెదిరించారు. దౌర్జన్యం చేశారు. చేసేది లేక, గత ఏడాది జూన్ 7వ తేదీన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్య కాలనీకి చెందిన 25 గిరిజన కుటుంబాలు గ్రామాన్నే కాదు.. రాష్ట్రాన్నే వీడారు. ఒడిశా రాష్ట్రానికి వెళ్లి తలదాచుకుని ప్రాణాలను దక్కించుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం దుబ్బాక, మరి కొన్ని ప్రాంతాల్లో పరాయిపంచన చంటి బిడ్డలు.. చదువుకునే పిల్లలు.. వయోవృద్ధులు.. గ్రామ ప్రథమ పౌరులు వారా వీరా అనేమీ.. ఆ కాలనీలోని గిరిజనమంతా ఊరు విడిచింది.. భాషకానీ భాష.. రాష్ట్రం కానీ రాష్ట్రానికి పొట్ట చేతపట్టుకుని వెళ్లింది. బిక్కు బిక్కుమంటూ 9 నెలలుగా కాలం గడుపుతోంది.. మళ్లీ మా స్వస్థలం చేరుతామో లేదోనన్న బెంగతో బతుకుతోంది. దీనంతటికీ కారణమేమిటంటే.. ఆ గిరిజనులు వైఎస్సార్ సీపీకి ఓటు వేయడమే. ఓటేసిన పాపానికి పచ్చనేతలు ఆ గిరిజనాన్ని బెదిరించి.. గ్రామ బహిష్కరణ చేయించారు. అయినా ఏ ఒక్కరూ నోరు మెదిపిన దాఖలాలు లేవు. ఆ గిరిజనం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వద్ద తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు.



తిరుపతి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు(ఫైల్)

బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

గ్రామ ప్రథమపౌరురాలినే తరిమేశారు

గత ప్రభుత్వ హయాంలో ఈశ్వరయ్య కాలనీకి చెందిన షికారీ మహిళ సుమతి గ్రామసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడమే కాలనీలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన 25 గిరిజన కుటుంబాలను గ్రామానికి చెందిన టీడీపీ బడానేత చంపేస్తామని బెదిరించి, గ్రామం నుంచి తరిమేశారు. ఊరొదిలి వెళ్లిపోయిన వారిలో గ్రామ సర్పంచ్ కూడా ఉన్నారు. ప్రస్తుతం గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు సైతం సర్పంచ్ ప్రమేయం లేకుండానే టీడీపీ నేతలే అన్నీ తామై పంచాయతీ పాలనను కొనసాగిస్తూ.. స్థానిక సంస్థల హక్కులను అపహాస్యం చేస్తున్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన

ఎస్టీ కులానికి చెందిన 25 కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేస్తే ప్రజా సంఘాలు కానీ, దళిత, గిరిజన సంఘాలు కానీ అటువైపు కన్నెత్తి చూడలేదు. గొంతెత్తి ప్రశ్నించలేదు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి విన్నవించినా పట్టించుకోలేదు.

మాజీ సీఎం వైఎస్‌జగన్‌ను కలసిన బాధితులు

పచ్చనేతలకు భయపడి ఊరొదిలి వెళ్లిన 25 గిరిజన కుటుంబాలు గురువారం విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమ గోడును ఆయనతో పంచుకున్నారు. అండగా నిలుస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు.

చిగురుటాకులపై ప్రతాపం



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చాలా దారుణంగా ప్రతీకార దాడులకు తెగబడుతున్నారు. 9 నెలలుగా ఎంతోమందిపై భౌతిక దాడులు చేశారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే, తిరిగి వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపైనే అక్రమ కేసులు బనాయించి హింసిస్తున్నారు. ఎంపేడు ఈశ్వరయ్య కాలనీలోని 25 షికారీ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేస్తే.. ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందింది. బాధితులను మళ్లీ వాళ్ల ఇళ్లకు చేర్చి భరోసా కల్పించాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

కమిషన్ కలుగజేసుకోవాలి



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక, ప్రతిపక్ష పార్టీలతోపాటు, సామాన్యులైన వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద, సామాన్య ప్రజలే టార్గెట్‌గా దాడులు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఎంపేడు ఈశ్వరయ్య కాలనీలో 25 కుటుంబాలు రాష్ట్రం విడిచిపెట్టి వెళ్లిపోయేలా చేశారు. 9 నెలలుగా వారంతా బయటి రాష్ట్రాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మగ్గుతున్నారు. కాలనీలో వాళ్ల ఇళ్లన్నీ తాళాలు వేసి బోసిపోయి ఉన్నాయి. మానవ హక్కుల కమిషన్ బాధితులకు న్యాయం చేయాలి.

– డాక్టర్ మద్దెల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

చాలా దుర్మార్గం



ఈశ్వరయ్య కాలనీకి చెందిన షికారీలను ఊళ్లో నుంచి వెళ్లగొట్టడం చాలా దుర్మార్గం. అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తూ చిగురుటాకులపై ప్రతాపం చూపి నిమ్నజాతులను హింసించడం తగదు. మానవహక్కుల కమిషన్ ఈ ఘటనపై కలుగజేసుకుని బాధితులకు న్యాయం చేయాలి.

– కె.హరినాథ్, గిరిజన సంఘ నేత, తిరుపతి జిల్లా

నోటీస్ బోర్డు

పరిశ్రమలశాఖ జీఎంగా సుధాకర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధాకర్

తిరుపతి అర్బన్: పరిశ్రమలశాఖ జిల్లా జీఎంగా సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు నుంచి బదిలీపై తిరుపతి జిల్లాకు విచ్చేశారు. కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి, నెల్లూరు జిల్లా పరిశ్రమలశాఖ జీఎంగా పనిచేస్తున్న ప్రసాద్‌ను నెల్లూరు జిల్లాకు మాత్రమే పరిమితం చేశారు.

డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో 22న జాబ్ మేళా

గూడూరురూరల్: పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా జరుగుతుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అల్ట్రా మెరైన్ పిగ్మెంట్స్, అపోలో టైర్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలు, బయోడేటా ఫామ్‌తోపాటు రిజిస్ట్రేషన్ లింకులో తప్పనిసరిగా నమోదు చేసుకుని అడ్మిట్ కార్డుతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9700561225 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

22న ఉద్యోగమేళా

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్తంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నాయన్నారు. ఉద్యోమేళాలో వీల్స్ ఇండియా, ఎయిర్‌టెల్, బ్లూస్టార్ తదితర కంపెనీలు కలసి 140 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు httpr//naipunyam.ap.govt.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ చైతన్య చక్రవరిని 9440374535 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

శ్రీసిటీ కంపెనీలకు ప్రతిష్టాత్మక సీఐఐ అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న మోండెలీజ్ ఇండియా ప్రతినిధులు



అవార్డు స్వీకరిస్తున్న కెలాగ్స్ ఇండియా ప్రతినిధులు



అవార్డు స్వీకరిస్తున్న డానియెలి ఇండియా ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాలెం): పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలను పాటించిన శ్రీసిటీలోని మూడు పరిశ్రమలకు '2024 సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డ్స్' దక్కాయి. విశాఖపట్నం నోవోటెల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మాదిరెడ్డి ప్రతాప్ ఈ అవార్డులను అందజేశారు. శ్రీసిటీకి చెందిన మొండెలెజ్ ఇండియా, కెలాగ్స్, డానియెలి కంపెనీలు ఈ పురస్కారాలను అందుకున్నాయి. ఇందులో మొండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డ్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ విభాగంలో బంగారు పతకం దక్కింది. 2024 సంవత్సరానికి బెస్ట్ సేఫ్టీ పర్ఫార్మర్‌గా ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో గోల్డ్ అవార్డును కెల్లాగ్స్ అందుకుంది. ఇక డానియెలి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డ్ కింద ఇంజినీరింగ్ విభాగంలో గోల్డ్ పురస్కారం సొంతమైంది. విజేతలకు అభినందనలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ అవార్డులు భద్రతా ప్రమాణాలను పాటించడంలో ఆ పరిశ్రమల అంకితభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్మన్ డా.మురళీకృష్ణ హాజరయ్యారు.

సక్రమ విధి నిర్వహణకు ఆరోగ్యం ముఖ్యం



మెడికల్ కిట్లను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం : ఎర్రచందనం పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలంటే ఆరోగ్యం ముఖ్యమని టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు అన్నారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు, ఎస్పీ పి.శ్రీనివాస్ మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. అడవుల్లో కూంబింగ్‌కు వెళ్లే సిబ్బంది పలు కారణాలతో గాయపడుతుంటారన్నారు. ఈ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఫస్ట్ ఎయిడ్‌తోపాటు మెడికల్ కిట్లను తెప్పించి పంపిణీ చేశారన్నారు. మెడికల్ కిట్‌లో టాబ్లెట్‌లు,ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, మోకాలి కేపులు, బెల్టులు, పెయిన్ జెల్‌లు, సర్జికల్ డ్రెస్సింగ్ బ్యాండేజీలతోపాటు 15 రకాల మందులను అందజేశామన్నారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు జె.బాలిరెడ్డి, వీ.శ్రీనివాసులురెడ్డి, ఎండీ షరీఫ్, ఆర్ఐ సాయి గిరిధర్, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే సదస్సులు



మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

వడమాలపేట(విజయపురం): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి జిల్లా ఎస్ఈ సురేంద్రనాయుడు అన్నారు. వడమాలపేట మండలం పాదిరేడు రచ్చబండ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రాంతాల వారీగా సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు సదస్సులు జరుగుతాయన్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 241 సబ్‌స్టేషన్లు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో ఉన్న డీఈ, ఏఈ తన పరిధిలోని సబ్‌స్టేషన్ ఆవరణలో సదస్సు ఏర్పాటు చేసి, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఈఈ దేవఆశీర్వాదం, డీఈఈ శంకయ్య, ఏఈ భాస్కర్‌రాజు, ధనంజేయులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి సేవలో ఎస్పీ శైలజ



పెంచలకోనలో గాయని శైలజ

రాపూరు: మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామివారిని ప్రముఖ గాయని ఎస్పీ శైలజ గురువారం దర్శించుకున్నారు. ఆమెకు దేవస్థానం సిబ్బంది సాదర స్వాగతం పలికి, మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తొక్కిసలాటపై కొనసాగుతున్న జ్యుడీషియల్ విచారణ

తిరుపతి అర్బన్: వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీలో నెలకొన్న తొక్కిసలాటపై జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోంది. అందులో భాగంగా జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఎదుట విచారణకు దశలవారీగా అంతా హాజరవుతున్నారు. గురువారం అప్పటి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అప్పటి టీటీడీ సీవీఎస్ఓ శ్రీధర్‌ను కలెక్టరేట్‌లో జ్యుడీషియల్ కమిషన్‌కు కేటాయించిన చాంబర్‌లో చైర్మన్ విచారించారు. ఆ మేరకు వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. బుధవారం విచారణకు అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్ఓ శ్రీధర్, అప్పటి టీటీడీ జేఈఓ గౌతమి హాజరైనప్పటికీ గౌతమిని మాత్రమే ఎక్కువ సమయం విచారించారు. ఈ క్రమంలో రెండోరోజు సుబ్బరాయుడు, శ్రీధర్‌ను విచారణ చేపట్టారు. శుక్రవారం మూడో రోజు వీరిద్దరిని విచారణ చేయనున్నారు. ఈ నెల 17న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, 18న టీడీపీ ఈఓ శ్యామలారావును విచారించిన సంగతి తెలిసిందే. నెల రోజులుగా జ్యుడీషియల్ చైర్మన్ నేతృత్వంలో జోరుగా విచారణ సాగుతుంది. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందగా 44 మందికి గాయాలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నెల రోజులుగా రాష్ట్రంలో గాయపడిన వారితోపాటు వివిధ రాష్ట్రాల నుంచి తొక్కిసలాటలో గాయపడిన వారిని ఇప్పటికే విచారించారు. మరో రెండు రోజుల తర్వాత జనవరి 8న డ్యూటీలో ఉన్న ఉద్యోగులను విచారణ చేపట్టనున్నారు. అలాగే బైరాగిపట్టెడలోని శ్రీపద్మావతి పార్కు సమీప ప్రాంతంలో దుకాణాలు నిర్వహిస్తున్న వారిని విచారించనున్నారు.

తిరుపతిలో వ్యక్తి దారుణ హత్య



యువకుని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్: నగర శివార్లలో గుర్తుతెలియని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం పంచాయతీలో ఉన్న ఓ హోటల్ సమీపంలోని ఖాళీ స్థలంలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. హత్యకు గురైన ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. హత్యకు గురైన వ్యక్తి ఆనవాళ్లు కనిపించకుండా చేయడానికి దుండగులు ముఖం, కాళ్లు, చేతులు, పొట్ట భాగంలో యాసిడ్ పోయడంతో అంతా కాలిపోయింది. దీంతో డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, తనిఖీలు చేసింది. అలాగే వేలి ముద్రల నిపుణులు సైతం అక్కడకు చేరుకుని మృతదేహం వేలి ముద్రలు సేకరించారు. అనంతరం తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల గుండెల్లో చిరస్మరణీయుడు వైఎస్సార్

- విశాఖ క్రీడామైదానానికి వైఎస్సార్ పేరు తొలగింపుపై భూమన ఆగ్రహం

తిరుపతి మంగళం : పేదల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన గొప్ప నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. విశాఖ క్రీడా మైదానానికి ఉన్న వైఎస్సార్ పేరును కూటమి ప్రభుత్వం తొలగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అందించి ప్రజల గుండెల్లో దేవుడుగా కొలువైన మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అన్నారు. అలాంటి గొప్ప నాయకుడి పేరు విశాఖ క్రీడామైదానానికి ఉంటే ఎంతో స్ఫూర్తిగా ఉంటుందన్న ఉద్దేశంతో క్రీడా అసోసియేషన్ వారే అప్పట్లో వైఎస్సార్ పేరు పెట్టారన్నారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు పాలన ఎంత దుర్మార్గపు పాలనో ప్రజలకు అర్థమవుతోందని ధ్వజమెత్తారు.

ఎట్టకేలకు వెటర్నరీ జూడాల సమ్మె విరమణ

- 46 రోజుల నిరవధిక నిరసనకు తెర
- తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు ప్రకటించిన జూడాలు



సమ్మె విరమింపజేస్తున్న వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ జగపతిరామయ్య

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు ఎట్టకేలకు నిరవధిక సమ్మెను విరమించారు. అన్ని వైద్య విభాగాల్లో జూడాలకు ఇస్తున్న స్టయిఫండ్‌కు సమానంగా తమకూ గౌరవేతనం ఇవ్వాలని 46 రోజులుగా తరగతులు బహిష్కరించి, సమ్మె బాట పట్టి పశువైద్య విద్యార్థులు గురువారం సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. ప్రభుత్వం గౌరవ వేతనాన్ని రూ.7 వేల నుంచి రూ.10500కు పెంచుతూ జీఓ జారీ చేయడంతో తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు వీసీ రమణకు, వర్సిటీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీంతో వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య సమ్మె చేస్తున్న విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి, నిరసనను విరమింపజేశారు. అనంతరం జూడాలు మాట్లాడుతూ ప్రభుత్వం యూజీ విద్యార్థులకు రూ.25 వేలు, పీజీకి రూ.50 వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.75 వేలు పెంచితీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెంచిన వేతనంతో తాము సంతోషంగా లేమని, ప్రభుత్వానికి మరికొంత సమయం ఇస్తున్నామని, తమ న్యాయపరమైన డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు.

సోమవారం నుంచి తరగతులు ప్రారంభం

46 రోజులుగా వెటర్నరీ కళాశాల తరగతి గదులు మూతపడి నిర్మానుష్యంగా మారాయి. విద్యార్థులు సమ్మె విరమణతో సోమవారం నుంచి యథావిధిగా తరగతులు ప్రారంభం కానున్నాయి. అకడమిక్ సంవత్సరం ముగింపు దశలో ఉండడంతో సిలబస్, పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహణపై అధికారులు మరింత దృష్టి సారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

కక్ష సాధింపు చర్యలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

చిట్టమూరు: చిట్టమూరు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు నెల్లిపూడి అన్వేష్ (సోషల్ యాక్టివిస్టు) ఎన్నికలకు ముందు పెట్టిన పోస్టింగ్‌లను దృష్టిలో ఉంచుకుని రెండు నెలల క్రితం పోలీసులు పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆయన అన్ని గ్రూపుల నుంచి లెఫ్ట్ కావడంతోపాటు ఇకపై ఇలాంటి పోస్టులు పెట్టనని లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చాడు. అయినప్పటికీ కూటమి నాయకులు అతన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో ఆయన ఇంటిని కూల్చడానికి పూనుకున్నారు. దీంతో మండల తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్, ఎంపీడీఓ మనోహర్ గౌడ్ పోలీసు శాఖ అధికారులు బందోబస్తుతో గురువారం నెల్లిపూడి అన్వేష్‌కు చెందిన ప్రహరీ గోడ, బాత్‌రూమును పూర్తిగా జేసీబీతో ధ్వంసం చేశారు. ఇదే వీధిలో ప్రహరీ గోడలున్నప్పటికీ కక్ష గట్టి అన్వేష్ ఇంటిని ధ్వంసం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రహరిగోడను కూల్చేందుకు వచ్చిన అధికారులతో ఇంట్లో ఈ నెల 24 తేదీ సోమవారం ఓ శుభకార్యం ఉందని దీనికి పలు గ్రామాల నుంచి బంధువులు, స్నేహితులు వస్తారని ఆ కార్యక్రమం అయిన తర్వాత తానే స్వచ్ఛందంగా తొలగిస్తామన్నప్పటికీ కనికరం కూడా చూపలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.